క్లుప్తంగా

అమ్మవారికి విశేష పూజలు

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం నందు శ్రీ ఆండాళ్(గోదా) అమ్మవారి తిరునక్షత్రం సందర్భంగా అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి తిరుప్పావై సేవా కాలం, అష్టోత్తర తులసీదళార్చన, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ గోష్ఠి, ప్రసాద వినియోగం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణంలో మావుళ్లమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన నల్లమల్ల వెంకట సుబ్బారావు- సుబ్బలక్ష్మి దంపతులు నిత్యాన్నదాన ప్రసాదం పథకానికి రూ.50 ఏబై వేలు, అమ్మవారి సంపూర్ణ స్వర్ణ మయం కొరకు ఆరుగ్రాముల బంగారాన్ని విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి, ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణం

ఆకివీడు: మండలంలో గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. నైవేధ్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గీతా మహిళా మండలి అధ్యక్షురాలు కే.రాజ్యలక్ష్మి అక్కయ్య, గీతామహిళా మండలి సభ్యులు విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. కార్యక్రమంలో అర్చకులు శేషాచార్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శక్తీశ్వర స్వామికి విశేష పూజలు

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో పార్వతి సమేత శక్తీశ్వర స్వామికి శ్రావణ మాసంలో సోమవారం సందర్భంగా వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా ఆలయ అర్చకులు కొడమంచిలి తమ్మిరాజు, మద్దిరాల సత్యనారాయణమూర్తి స్వామివార్లకు పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చన, గో క్షీరాభిషేకాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి, దండు కృష్ణంరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ ఆత్మీయ సమావేశం



రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు విన్నకోట సురేష్ బాబు, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ స్వర్ణ అనిల్ కుమార్, బాపట్ల జిల్లా అధ్యక్షుడు రావిపాటి విష్ణువర్ధన్‌లు మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ ఏజెన్సీ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కొల్లి సత్యనారాయణమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా డిజిటల్ మార్కెటింగ్ ద్వారా వ్యాపార విస్తరణ ఏ విధంగా చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని రియల్ ఏజెంట్స్ పాల్గొన్నారు.

తల్లికి వందనం సరే.. చదువుల తల్లికి ఏదీ వందనం!

- బావురుమంటున్న సర్కారు బడులవిద్యార్థులు
- బోధనేతర పనులతో విలవిలలాడుతున్న ఉపాధ్యాయులు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు



అప్పుడే చినిగిపోయిన పుస్తకాల బ్యాగ్

ఆకివీడు: సర్కారు బడులు సంతకెళ్లుతోన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక ప్రక్క విద్యార్థులు, మరొక ప్రక్క ఉపాధ్యాయులు ప్రభుత్వ విధానాలతో తలలు పట్టుకొంటున్నారు. విద్యార్థులకు విద్యా బోధన కరువైంది. జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వెన్నంటి పీడిస్తోంది. దీంతో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గుచూపుతున్నారు. ఆగస్టు నెలాఖరు వరకూ ప్రవేశాలు ఉండటంతో విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లకు చెక్కేస్తున్నారు. అమ్మ ఒడి ఎక్కడైనా వస్తుందని, ఆడబ్బుతో కార్పొరేట్ ఫీజులు కట్టుకోవచ్చనని ఆలోచనలో తల్లిదండ్రులున్నారు. ఉండి నియోజకవర్గంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు బోధన ఇబ్బంది తలెత్తుతోంది. వర్కు ఎడ్జెస్ట్‌మెంట్ పేరుతో మూడు రోజులు ఒక పాఠశాలలో, మరో మూడు రోజులు ఇంకొక పాఠశాలలో ఉపాధ్యాయులు పనిచేయాల్సి వస్తుంది. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో చాలా మంది చేరలేదు. బదిలీ అయిన స్థానంలోకి మరొక బదిలీ ఉపాధ్యాయుడు వచ్చి చేరాల్సి ఉండగా, ఆ ఉపాధ్యాయుడుకి రిలీవ్ ఆర్డర్ ఇవ్వకపోవడంతో బదిలీ అయిన స్థానం ఖాళీగా కన్పిస్తుంది. దీంతో పని సర్దుబాటుకు అవకాశం ఏర్పడింది. ఈ విధానం వల్ల విద్యార్థులకు బోధనలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సకాలంలో సిలబస్ పూర్తి అయ్యే అవకాశం ఉండదంటున్నారు. ఉపాధ్యాయులు నిరంతరం పాఠశాలకు రాకపోవడంతో విద్యార్థులో అయోమయ పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. విద్యార్థులో పఠనా శక్తి తగ్గిపోతుందంటున్నారు. విద్యా వ్యవస్థ కుంటుపడుతోందంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల మక్కువ తగ్గిపోతుంది.

బోధనేతర పనుల భారం

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు పెనుభారంగా మారాయి. ఆయా పాఠశాలల్లో అంతంత మాత్రంగానే ఉన్న ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయించడంతో ఉపాధ్యాయుల్లో బోధనా శక్తి పడిపోతుందనే విమర్శలు వెల్లువెత్తుతోన్నాయి. పలు యాప్‌లు ప్రతి రోజూ 7 పూరించాల్సి ఉంది. మరి కొన్ని వారంలో మూడు, నాలుగు ఉంటాయి. బెల్టులు, పుస్తకాలు, బ్యాగ్‌లు, షూ వంటివి ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ఒక ప్రక్క బ్యాగ్‌లు చినిగిపోతుంటే ఆన్‌లైన్ ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల హాజరు 9.30 గంటలలోపు ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. పీ–4 సర్వేను కూడా ఉపాధ్యాయులకు అప్పగించనున్నారని పలువురు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ యాప్‌ల విధానంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

శిక్షణ కార్యక్రమాలతో ఎగనామం

ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు పలు శిక్షణ కార్యక్రమాలతో ఉపాధ్యాయులు పాఠశాలలకు ఎగనామం పెడుతోన్నారు. స్కూల్ క్లస్టర్ల పేరుతో ఆ రోజు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నారు. దీనివల్ల కూడా తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్లస్టర్ల వల్ల ఉపాధ్యాయులకు ఏ విధమైన ఉపయోగంలేదు. క్లస్టర్‌లలో హాజరు నమోదు చేయాల్సి ఉంది. పుస్తకాలు, బియ్యం సత్రమంగా, సరైన సమయంలో దిగుమతి చేయడం లేదు. ఈ పనులతో కూడా ఉపాధ్యాయులు బోధనా సమయం దుర్వినియోగం అవుతోంది.

తప్పదా! పీ–4 దత్తతు

పీ-4 విధానం ఉపాధ్యాయులకూ అంటగట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పేద విద్యార్థుల్ని, కుటుంబాల్ని దత్తతు తీసుకోవలనే యోచన చేస్తుంది. దీనిని ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జీతాలు, డీఏలు, బకాయిల, పీఆర్‌సీలు వంటివి అందడంలేదని మదనపడుతున్న తమపై పీ-4 రుద్దాలనుకోవడం సరికాదంటున్నారు.

నియోజకవర్గంలో ..

ఎంపీపీ	స్కూళ్లలో	ఉపాధ్యాయుల కొరత:
ఆకివీడు	6	12
కాళ్ల	3	03
పాలకోడేరు	6	00
ఉండి	4	01

బోధన మరిచిపోతారు



ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగిస్తే బోధన మరిచిపోయే స్థితి ఏర్పడుతుంది. ఉపాధ్యాయుల కొరత కొన్ని పాఠశాలల్లో ఉంది. వాటిని భర్తీ చేసేందుకు పని సర్దుబాటు పేరుతో విధులు నిర్వహిస్తున్నారు. యాప్‌లు, ఆన్‌లైన్ ఇతరత్రా పనులతో ఉపాధ్యాయులు విసిగిపోతున్నారు. గత ప్రభుత్వంలో ఇటువంటి ఇబ్బందులు లేవు. బోధనకే ఉపాధ్యాయుడు పరిమిత కావాలి.
పెదపూడి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ నాయకులు, మోగల్లు, పాలకోడేరు మండలం.

పి-4 గ్రామ సభలను త్వరితగతిన పూర్తి చేయాలి



జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): పి–4 మార్గదర్శకుల నమోదు, బంగారు కుటుంబాల అనుసంధానం అంశంపై సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు 1,623 మంది మార్గదర్శకులుగా నమోదు కావడం జరిగిందని, 35,831 మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. సమాజంలో మార్గదర్శకులు బంగారు కుటుంబాలని దత్తత తీసుకొని వారికి చేయూతనిస్తే వారు ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. మన జిల్లాకు సంబంధించి సంపన్నులు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడినవారు చాలామంది ఉన్నారని వారిని గుర్తించి పి.4 ఉద్దేశాన్ని అవగాహన కల్పించి మార్గదర్శకులుగా నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. జిల్లాలో మార్గదర్శకులుగా నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీఓ కె.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డిఇఓ ఈ నారాయణ, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి యు.మంగపతిరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైనుకు శంకుస్థాపన



మోగల్లు మంచినీటి పైపులైన్ కు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి

పాలకోడేరు: మండలం మోగల్లు గ్రామంలో మంచినీటి పైపులైన్ కోసం ఎన్నో దశాబ్దాలుగా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న మంచినీటి పరిష్కారానికి ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి, నాయకులు కొత్తపల్లి నాగరాజు, కొత్తపల్లి సూర్యనారాయణరాజు ప్రోత్సాహంతో వేండ్ర గ్రామం జీఅండ్‌వి కాలువ నుంచి కోటి రూపాయలు పైబడి నిధులతో పైపులైన్ వేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మోగల్లు గ్రామ మంచినీటి పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు గ్రామ ప్రజలందరూ స్థానిక శాసనసభ్యులు కనుమూరు రఘురామకృష్ణంరాజు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె సుజాత, పంచాయతీ వార్డు మెంబర్లు, స్థానిక నాయకులు సుబ్బరాజు, నాయకులు పాల్గొన్నారు.

అవసరానికి మించి ఎరువులు వాడవద్దు



ఎరువులు వినియోగంపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: రైతులు వరిసాగులో అవసరానికి మించి ఎరువులు వినియోగించవద్దని, ఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, మత్స్య, మార్క్‌ఫెడ్ అధికారులతో ఎరువుల లభ్యత, వినియోగంపై సమీక్షించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సేంద్రియ ఎరువులు వాడకం ద్వారా మంచి దిగుబడుతు సాధించడమే గాక తక్కువ పెట్టుబడితో పాటు భూమికి సారం లభిస్తాయన్నారు. జిల్లాలో గురప్రు డెక్క ద్వారా వర్మి కంపోస్ట్ తయారిని చేపట్టామని, అధిక పోషక విలువలున్న గురప్రు డెక్క కంపోస్ట్‌ను అవసరమైన రైతులు వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి కెఎస్‌వి నాగలింగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయండి



ఉండిలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఉండి: భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్‌బోర్డును ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మికుల మండలాధ్యక్షుడు శేషాద్రి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం సీఐటియూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల రెవెన్యూ అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల కోసం రాష్ట్రంలో వెల్ఫేర్‌బోర్డును పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే బోర్డులో కార్మికుల నమోదు వంటి ప్రక్రియను సులభతరం చేసి వార్డు, గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు. వెల్ఫేర్ సెస్సును ఐదు శాతానికి పెంచి సెస్సు వసూలుకు, కార్యకలాపాల నిర్వహణకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గాయపడిన భవన నిర్మాణ కార్మికులకు ఐదురోజుల్లో హాస్పటల్‌లో ఉండాలనే నిబంధనను తీసివేయాలన్నారు. ప్రమాదం కారణంగా రెస్టులో ఉన్న కార్మికులకు ఇచ్చే రూ.100 భృతిని రూ.500కు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల వలన,అనారోగ్యం వలన మంచానపడిన కార్మికులకు వెల్‌ఫేర్ బోర్డు ద్వారా ఈఎస్ఐ తరహాలో ఉచిత వైద్య సహాయం కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శేషాద్రి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆదాము, అడపా గణేష్, యేడిద సతీష్, అంబటి వాసు, తిరుకాపు కేశవ, సతీష్, అడబాల ప్రసాద్, కూన దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వంచనపై మండిపాటు..దగాపై తిరుగుబాటు

- కూటమి పాలనలో సంక్షామం
- వైఎస్ జగన్ చేసిన మంచిని వివరిద్దాం
- రైతులను విస్మరించిన చంద్రబాబు తీరును ఎండగడదాం
- కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు



వైఎస్సార్‌సీపీ నాయకులను సన్మానిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఉండి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. సోమవారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్ కార్యక్రమ ప్రణాళికలపై చర్చించారు. మండలపార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పీవీఎల్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు నయవంచన చేస్తున్నారని మండిపడ్డారు. ఓట్లు వేయించుకొని అవసరం తీరాక హామీలలను గాలికి వదిలేశారన్నారు. అధికారంలోకి రాగానే ఈ హామీలు ఎలా నెరవేర్చాలో అర్థం కావడం లేదు వీటికి డబ్బు ఎక్కడనుండి వస్తుందంటూ కొత్త రాగాలు పాడుతున్నారని విమర్శించారు. అంటే ఏదైనా చెప్పి ప్రజలను మోసగించి అధికారం సంపాదించాలన్న తపన తప్ప మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలాగా చెప్పింది చెప్పినట్టుగా నెరవేర్చే నాయకులు కూటమి ప్రభుత్వంలోనే లేరని మండిపడ్డారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వడం లేదని, 50ఏళ్ల ఫించన్ ఇవ్వడం లేదని, జ్యాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా, నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను దగా చేశారన్నారు. చంద్రబాబు మొదటి సంతకం మెగా డీఎస్సీలో 16వేల టీచర్ పోస్టుల కోసం పెట్టారని, అదే జగన్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో 1.40లక్షల శాశ్వత ఉద్యోగాలను కల్పించారన్నారు. ఆడబిడ్డలకు ఆశపెట్టి 18 ఏళ్ల నుంచి 50ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ రూ.1500 ఇస్తామని మోసం చేశారన్నారు. నిరుద్యోగ భృతి లేదు, పల్లెల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు అర్హులైన నిరుపేదలకు ఇస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా చేప్పినవి, చెప్పనివి కూడా చేసి చూపించారన్నారు. దానికి ప్రజలే సాక్ష్యులని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల పక్షన వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని ప్రజలకు న్యాయం జరిగే వరకు ఊరుకునే ప్రశక్తిలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, ముదునూరి ప్రసాదరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, సాగిరాజు, హరివర్మ, గంధ్రాజు రాజేష్‌వర్మ, బడుగు బాలాజీ, గలావిల్లి ధనుంజయ, కరిమెరక శివనాగరాజు, ముదునూరి సుబ్బరాజు, కరిమెరక మల్లిఖార్జున, సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, గుండు నాగేశ్వరరావు, వర్రే పైడియ్య, నిమ్మల కేశవకుమార్, బందెల ప్రమీల, రంగరాజు, గిరడ శ్రీను, బొక్కా శ్రీను, కడలి శ్రీను, బేతాళ పుష్ప, కలిదిండి సీతారామరాజు, చిరుగుపాటి రాజేష్, కోనాల రాజేంద్ర, చెరుకువాడ బాలాజీ, బిల్ మోరియా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగ కమిటీలను నియమించాలి



వెంకటరాయుడుకు అనుబంధ విభాగాల జాబితాను అందజేస్తున్న మోహన్‌యాదవ్



నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ పీవీఎల్‌తో అనుబంధ విభాగాల జిల్లా ఇన్‌చార్జ్ మోహన్‌యాదవ్

భీమవరం: భీమవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని మరింత పటిష్టం చేయడానికి పార్టీ అనుబంధ విభాగాల కమిటీలను త్వరితగతిని పూర్తి చేయాలని ఆపార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర ఇన్‌చార్జ్ మోహన్‌యాదవ్ అన్నారు. సోమవారం రాయలయం గ్రామంలోని పార్టీ నియోజకవర్గ సమన్వకర్త చినమిల్లి వెంకటరాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఇటువంటి సమయంలో ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు నివాలన్నారు. కూటమి నాయకులు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేసే విధంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేయాలని తద్వారా పార్టీని మరింత పటిష్టం చేయాలని మోహన్‌యాదవ్ చెప్పారు. ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే విధంగా కృషి చేసి ప్రజలకు అండగా నిలవాలన్నారు. ప్రభుత్వం అక్రమంగా బనాయిస్తున్న కేసులకు బయపడాల్సిన అవసరం లేదని పార్టీ అండగా ఉంటుందన్నారు. భీమవరం నియోజకవర్గంలో పార్టీ అనుబంధ కమిటీలను తక్షణం పూర్తిచేసి నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేసే విధంగా కార్యచరణ రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, వీరవాసరం మండల అధ్యక్షుడు చవాలకు సత్యనారాయణ, పార్టీ మేధావుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఈద జాషువ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఉండి: పార్టీ బలోపేతం, ప్రజలకు న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుదామని పార్టీ అనుబంధ విభాగ కమిటీల జిల్లా ఇన్‌చార్జ్ కొలుసు మోహన్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పార్టీ అనుబంధ కమిటీల పూర్తిస్థాయి నియమాకాలపై సోమవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పీవీఎల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అనుబంధ కమిటీల నియామకంపై చర్చించారు. ఈ సందర్భంగా మోహన్‌యాదవ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పారీ అనుబంధ కమిటీల నియామకం పూర్తిస్థాయిలో చేపట్టేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శలు

వీరవాసరం: వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ కుటుంబాన్ని సోమవారం భీమవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకటరాయుడు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నర్సాపురం పార్లమెంటరీ ఇంచార్జ్ గూడూరి ఉమా బాల, వీరవాసరం మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణమూర్తి, వైఎస్సార్ సీపీ భీమవరం టౌన్ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, మాజీ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరావు, సీనియర్ నాయకులు కోడే యుగంధర్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు చిగురుపాటి సందీప్, వైఎస్సార్ సీపీ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు డీవీడీ ప్రసాద్, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: మండలంలోని పెదగరువులో విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో మంగళవారం శ్రీరామపురం, పెదగరువు 11 కేవీ ఫీడర్లకు సంబంధించి ఆర్‌డీఎస్ఎస్ పనులు నిమ్మిత్తం, లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించుట కొరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. పెదగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలతో పాటు ఆక్వా లైన్లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజాపరిష్కార వేదికకు రెండు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా పరిష్కార వేదికకు రెండు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు సోమవారం తెలిపారు. దుంపగడప గ్రామంలోని ఉప్పుటేరు గట్టు వద్ద రోడ్డును పూడ్చివేసి మంచినీటి పైపులైన్‌కు అవరోధం కల్గిస్తున్నారని ఆ ప్రాంతానికి చెందిన తమ్ము నాగరాజు ఫిర్యాదు చేశారని తెలిపారు.

డిపార్ట్‌మెంటల్ టెస్టులను పకడ్బందీగా నిర్వహించాలి

భీమవరం: ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించే డిపార్ట్‌మెంటల్ టెస్టులను జిల్లాలో పగడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ డీఆర్‌ఓ ఛాంబర్‌లో డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూలై 29, 30, ఆగస్టు ఒకటిన నిర్వహించే డిపార్ట్మెంటల్ పరీక్షల నిర్వహణపై పోలీస్, విద్యుత్, ఏపీఎస్ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్, మున్సిపల్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిపిఎస్సి 4/2025 నోటిఫికేషన్ ద్వారా నిర్వహించబడుతున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని వైద్యశాఖ అధికారులు ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను, సమయానికి అనుగుణంగా ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

వృద్ధుడికి గాయాలు

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీకి చెందిన గురుగుబిల్లి పెంటయ్య అనే వృద్ధుడు అదే గ్రామంలో ఓ గాజులు అమ్మే దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 27వ తేదీ ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనదారుడు అతనిని ఢీకొట్టాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేద విద్యార్థులను ప్రోత్సహించాలి

భీమవరం: ప్రతిభ గల పేద విద్యార్థులకు ప్రోత్సాహం అందించడానికి, విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించడానికి జిల్లాలో సైన్స్ పార్కు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఇ నారాయణను సర్వోదయ మండలి, వసుధ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థలు కోరాయి. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని డీఈవోకు వినతిపత్రం అందజేశారు.

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



భీమరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంటి పరీక్షలు చేస్తున్నదృశ్యం

భీమవరం: యువత కంటి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని భీమవరం పట్టణానికి చెందిన నేత్ర వైద్యుడు డాక్టర్ యువి రమణరాజు అన్నారు. స్థానిక ఆర్ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర పరీక్షా శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే వయస్సులో నయనేంద్రియం యొక్క సంరక్షణ ప్రాధాన్యత కలిగిన ముఖ్యాంశామని విద్యార్థులు స్పష్టమైన చూపుతో అధ్యయనం చేసి బంగారు భవిష్యత్తు స్వంతం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వికేజె ప్రసూన మాట్లాడుతూ ఎంతోమంది అంధ విద్యార్థులను చదివిస్తూ డాక్టర్ రమణరాజు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.